# పరేడ్ గ్రౌండ్స్‌లో 25న సీఎం సభ

## మూడోసారి అధికారం మాదే

- హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- పరేడ్ మైదానంలో సభా స్థలి పరిశీలన



పరేడ్ మైదానంలో25న నిర్వహించనున్న సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, నవంబర్ 20 : నగరం నడిబొడ్డున ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం పరేడ్ మైదానంలో సభ ఏర్పాట్లపై కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత, ఎమ్మెల్సీలు ప్రభాకర్, దయానంద్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి, ఏసీపీలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంత్రి తలసాని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బహిరంగ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు ఈ సభకు వస్తారని తెలిపారు. జీఓ 58, 59ల క్రింద నగరంలో వేలాదిమందికి ఇంటి స్థలాలను రెగ్యులరైజేషన్ చేశామని తెలిపారు. నగరంలో సొంత ఇల్లు లేని సుమారు 70 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఉచితంగా అందజేశామని చెప్పారు. చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తిరిగి మూడోసారి అధికారంలోకి వస్తామని, హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఢిల్లీ నుంచి గద్దల్లా వాలారని, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 40 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించలేదని, ఇప్పుడు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులకే గ్యారెంటీ లేని పరిస్థితుల్లో ఆరు గ్యారెంటీలకు దిక్కెక్కడ ఉందని ప్రశ్నించారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే వంట గ్యాస్ సిలెండర్‌ను రూ. 400లకు ఇస్తామని, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.15 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని ముఖ్యమంత్రి మేనిఫెస్టోలో తెలిపారని వివరించారు. పరేడ్‌లో భారీ బహిరంగ సభకు సంబంధించి 24 ప్రాంతాల్లో పార్కింగ్ కోసం కేటాయిస్తున్నామని చెప్పారు. 25వ తేదీ సాయంత్రం సభ నిర్వహిస్తున్నందున సభకు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం వేదిక ఏర్పాటు, ప్రజలు కూర్చునే ప్రదేశం, వీఐపీ గ్యాలరీ, పార్కింగ్ ఏర్పాటుపై స్థానిక నాయకులతో మంత్రి చర్చించారు. తాగునీరు, తదితర సౌకర్యాల గురించి స్థానిక నేతలకు పలు సూచనలు చేశారు. ఆదే విధంగా నార్త్‌జోన్ డీసీపీతో పాటు పోలీస్ అధికారులతో సభకు సంబంధించిన అంశాలపై మంత్రి తలసాని సుదీర్ఘంగా చర్చించారు. సభకు బందోబస్తుతో పాటు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, నాంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్ గౌడ్, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, అనితా ప్రభాకర్, లోక్‌నాథం, నళినికిరణ్‌తో పాటు నేతలు కన్నాయాదవ్, పవన్‌కుమార్ గౌడ్, ఆకుల హరికృష్ణ, నర్సింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అరుణాచలేశ్వరస్వామి కల్యాణం

### ఏడో రోజు కోటిదీపోత్సవం



కోటిదీపోత్సవానికి హాజరైన మంత్రి హరీశ్ రావు

కవాడిగూడ, నవంబర్20: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కోటిదీపోత్సవాన్ని ఏడవ రోజు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. రచన టెలివిజన్, భక్తిటీవీ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న కోటిదీపోత్సవంలో పురుషోత్తమ భారతి మహా స్వామీజి (శివలింగ మఠాధిపతి) అనుగ్రహభాషణం చేశారు. బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వర్ రావు ప్రవచనామృతం చేశారు. వేదికపై నర్మదా బాణలింగానికి కోటి భస్మార్చన పూజ, శివ లింగాలకు కోటి భస్మాభస్మార్చన పూజలు చేసి అగ్నిలింగ క్షేత్రం తిరువణ్ణామలై, అరుణాచలేశ్వర స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నంది వాహనంపై స్వామివారిని ఘనంగా ఊరేగించారు. ఈ కోటి దీపోత్సవానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

## యూఏఈ తెలుగు అసోసియేషన్ నూతన కార్యవర్గం



దుబాయ్‌లోని రాయల్ కాంకార్డ్‌లో ప్రమాణ స్వీకారం చేసిన తెలుగు అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): యూఏఈలోని తెలుగు అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. దుబాయ్‌లోని రాయల్ కాంకార్డ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు అసోసియేషన్ నూతన కమిటీ జనరల్ సెక్రటరీగా విజయ భాస్కర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమ సంధానకర్తగా మోహనకృష్ణ వ్యవహరించారు. తెలుగు అసోసియేషన్ ఆవిర్భావానికి కీలక సహకారాన్ని అందించిన రషీద్ అల్ మకూది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణను సన్మానించినట్లు తెలిపారు. ఇండియా-యూఏఈ జాతీయ గీతాలాపనలతో కార్యక్రమం ఆకట్టుకున్నది.

### నూతన కమిటీ ఇదే...

అసోసియేషన్ చైర్మన్‌గా వివేకానంద్ బలుస, అధ్యక్షుడిగా మసివుద్దీన్ మహ్మాద్, వైస్ చైర్మన్‌గా సుదర్శన్ కటారు, ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్ రాచకొండ, మార్కెటింగ్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు యెండూరి, అంతర్జాతీయ వ్యవహారాల విభాగ డైరెక్టర్‌గా సురేంద్రనాథ్ ధనేకుల, ఏపీ సంక్షేమ కార్యక్రమాల విభాగ డైరెక్టర్‌గా శ్రీధర్ దామర్ల, తెలంగాణ సంక్షేమ కార్యక్రమాల విభాగ డైరెక్టర్‌గా చైతన్య చకినాల, సాంఘిక సేవల విభాగ డైరెక్టర్‌గా భీం శంకర్ బంగారి, సాంస్కృతిక కార్యక్రమాల విభాగా డైరెక్టర్‌గా లతానగేశ్, మీడియా విభాగ డైరెక్టర్‌గా అబ్దుల్ ఫహీం షేక్, న్యాయ వ్యవహారాల నిర్వాహకుడిగా సత్యసాయి ప్రకాశ్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ప్రకాశ్, శ్రీధర్, మురళీ కృష్ణ తదిరులు పాల్గొన్నారు.

## ఎన్‌జీఆర్ఐ సైంటిస్టుకు అవార్డు



డాక్టర్ సి. మాణిక్యాంబ

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): జియోసైంటిస్ట్స్ అండ్ అలైడ్ టెక్నాలజిస్ట్స్ సొసైటీ ప్రదానం చేసే ఎక్సలెన్సీ అవార్డుకు ఎన్జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ సి. మాణిక్యాంబ ఎంపికయ్యారు. దేశంలోని ఇనుము, మాంగనీస్, బంగారం, ప్లాటినమ్ సమూహ మూలకాల ఖనిజ వనరుల అధ్యయనానికి ఈ అవార్డు వరించింది. ఇప్పటివరకు 130కిపైగా అంతర్జాతీయ జర్నళ్లను ప్రచురించగా, 12 పీహెచ్‌డీలకు గైడ్‌గా వ్యవహరించారు. ధార్వాడ్ క్రాటన్, కడప, కృష్ణా-గోదావరి బేసిన్‌లో మాంగనీస్ వంటి వనరులపై పరిశోధన చేశారు. ప్రస్తుతం జలావరణం, జీవావరణం పరిణామ క్రమానికి సంబంధించిన అంశాలపై ఆమె అధ్యయనం చేస్తున్నారు.

## బీఆర్ఎస్‌తోనే భద్రత.. భరోసా..

### మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ద్విచక్ర వాహనం, ఆటో మొబైల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 20: ఆటో మొబైల్, మెకానిక్స్ యజమానుల సమస్యలను పరిష్కరిస్తామని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్ డివిజన్‌లోని శుభశ్రీ గార్డెన్స్ వద్ద హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ద్విచక్రవాహనాలు, ఆటో మొబైల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆటో మొబైల్, మెకానిక్స్ యజమానులకు బీఆర్ఎస్ పార్టీ భరోసా ఇస్తుందని అన్నారు. వాహనదారులకు ఆటో మొబైల్, మెకానిక్స్ మంచి స్నేహితులని అన్నారు. కార్మికుల కష్టాలు దగ్గరుండి చూశానని, వాటిని పరిష్కరించడానికి ముందుంటానని అన్నారు. మెకానిక్స్ యజమానులకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఇప్పటికే కుటుంబం కోసం ఆరోగ్య శ్రీ ద్వారా రూ.15లక్షలతో చికిత్సలు పొందవచ్చని అన్నారు. వృద్ధులైన మెకానిక్స్‌కు పెన్షన్‌లు కల్పిస్తామని అన్నారు. స్వంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు, ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూంలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల తేజేశ్వరరావు, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, అనిల్‌కిశోర్, హెచ్ఎంఆర్ మెకానిక్స్ అధ్యక్షుడు అశోక్, శ్రీధర్‌గౌడ్, పరమేశ్, నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మాధవ్ రెడ్డి, శ్రీశైలం, పాషా తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఉదయ్‌సింగ్ బయాస్

బంజారాహిల్స్, నవంబర్ 20 : ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు 15వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు ఉదయ్ సింగ్ బయాస్ తెలిపారు. పంజాగుట్ట ఎర్రమంజిల్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్లను ఎన్ఈసీసీ అధ్యక్షులు డాక్టర్ బాల స్వామి, తెలంగాణ రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు కాసర్ల మోహన్ రెడ్డి, ఇంటర్నేషనల్ ఎగ్ కమిషన్ చైర్మన్ సురేశ్ రాయుడు, ఈపీసీ పౌల్ట్రీ ఇండియా సభ్యులు డాక్టర్ కేజీ ఆనంద్, టీఎస్ బాయిలర్ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి. రాఘవ రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో దేశం నుంచి 380 కంపెనీలు, వివిధ దేశాల నుంచి 45 సంస్థలకు సుమారు 1,500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ డైరెక్టర్లు పి. చక్రధర్ రావు, అనిల్ దుమాన్, కోశాధికారి శ్రీకాంత్, కార్యదర్శి నటరాజన్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తో ముదిరాజ్ సంఘం నాయకులు బండారి

## బీఆర్ఎస్ సర్కారు హ్యాట్రిక్ ఖాయం

అబిడ్స్, నవంబర్ 20: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పాటుపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు బండారి వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం బండారి వెంకటేశ్ ఆధ్వర్యంలో గోషామహల్, నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజ్‌లు వికారాబాద్‌కు తరలివెళ్లి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్ ముదిరాజ్, మారయ్య యాదవ్, జోగేందర్ సింగ్, శ్రీనివాస్ ముదిరాజ్, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.